క్లుప్తంగా

నేటి నుంచి కార్యదర్శులకు శిక్షణ

పుల్లలచెరువు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో ఈ నెల 16 వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లుగా ఎంపీడీవో వసంతరావునాయక్ ఆదివారం తెలిపారు. ఈ నెల 16 నుంచి 19 తేదీల్లో నాలుగు బ్యాచ్ లు ఏర్పాటు చేసి ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. సుస్థిర పాలన, అభివృద్ధి లక్ష్యాలపై పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణ తరగతులకు తప్పకుండా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

గుంటిగంగా భవాని అమ్మవారి ఆలయ ఈఓగా వాసు



తాళ్లూరు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గుంటిగంగా భవాని అమ్మవారి ఆలయానికి నూతన కార్యనిర్వహణధికారిగా గుంటపల్లి వాసు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన తాళ్లూరు దేవస్థాన కమిటీ నుంచి బదిలీపై గుంటిగంగాభవాని అమ్మవారి ఆలయానికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఈఓ పీ కార్తీక్ కందుకూరుకు బదిలీ అయ్యారు.

క్రీస్తు మార్గాన్ని అనుసరించండి

దర్శి: ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గాన్ని అనుసరించి ఆయన జీవితాన్ని తెలుసుకుని నిజ జీవితంలో ప్రేమ, శాంతి నెల కొల్పుకోవాలని పాస్టర్ పాల్ వెంకటేశ్వర్లు సూచించారు. శివరాజనగర్‌లోని క్రీస్తు మార్గం మినిస్ట్రీస్ చర్చ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ కైపు వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ముఖ్య అతిథులుగా హాజరైన బ్రదర్ నరేంద్ర, పాస్టర్ రాజు క్రీస్తు సందేశాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు రామిరెడ్డి, సురేష్, దానియేలు, చెన్నారెడ్డి, జనార్ధన్, ప్రసాద్, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

గంగాభవాని అమ్మవారికి ప్రత్యేక పూజలు



తాళ్లూరు: మండలంలోని గంగవరం పంచాయతీ సోమవరప్పాడు గ్రామ పరిధిలో వెలసిన గుంటి గంగాభవాని అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు విజయలక్ష్మీ, బాలరాజు, కామేశ్వరశర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ చైర్మన్ కే గురుబ్రహ్మం, ఈఓ గుంటపల్లి వాసు పర్యవేక్షించారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు



దొనకొండ: వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని వెంకటాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి రహదారిలో ఆదివారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన యరగొర్ల గోపి ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపు తప్పి కింద పడి స్పృహ తప్పాడు. అటువైపు వెళ్తున్న వారు 108కు సమాచారం ఇవ్వటంతో సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది ఈఎంటీ వెలుగొండయ్య, పైలట్ శ్రీను ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మాలల సింహ గర్జనకు తరలిన నాయకులు

మండ్లమూరు(దర్శి): గుంటూరులో తలపెట్టిన హలో మాల.. చలో గుంటూరు కార్యక్రమంలో భాగంగా మాలల సింహగర్జన కార్యక్రమానికి ముండ్లమూరు నుంచి నాలుగు వాహనాల్లో ఆ సంఘ నాయకులు తరలివెళ్లారు. ముందుగా స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళర్పించారు. మండల నాయకులు రిటైర్డ్ ఏఓ గొర్రెముచ్చు సుబ్బారావు, ఆర్ఎంపీ డాక్టర్ గోపనబోయిన హనుమంతరావు, ఉపాధ్యాయులు గోపనబోయిన ఏడుకొండలు, బ్రహ్మయ్య, నన్నం రామాంజనేయులు, గాజుల సుందరరావు, చిన్న యోగయ్య, ధర్నాసి లింగారావు, నూకతోటి బాలస్వామి తదితరులు ఉన్నారు.



గుంటూరు తరలివెళ్తున్న నాయకులు

తాగునీటికి తంటాలు

- గుక్కెడు నీటి కోసం గంటల కొద్దీ పడిగాపులు కాస్తున్న మహిళలు
- క్లోరినేషన్‌కు నోచుకోని వాటర్ ట్యాంక్‌లు
- రామతీర్థం, దర్శి నుంచి నీరు రాక ఆర్వో ప్లాంట్లను ఆశ్రయిస్తున్న మండల వాసులు
- తాగునీటి సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం



తాగునీటికోసం బిందెలతో ఎదురు చూస్తున్న మహిళలు

తాళ్లూరు: మండలంలోని పలు గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తంటాలు పడుతున్నారు. గుక్కెడు నీటి కోసం గంటల తరబడి కుళాయిల వద్ద మహిళలు పడిగాపులు కాస్తున్నారు. రామతీర్థం, దర్శి కాలువ నీళ్ల మండలంలోని 30 గ్రామాలకు రోజూ సరఫరా చేయవలసి ఉంది. అయితే దాదాపు నెల రోజుల నుంచి మండలంలోని ఆయా గ్రామాలకు తాగునీరు అందించడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆర్వో ప్లాంట్లకు క్యూ కట్టి మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్నారు. నీరు వచ్చినప్పుడు కనీసం పదినిమిషాలైనా పంపిణీ చేయడం లేదని, తాగునీటి కోసం నిత్యం గొడవలు జరుగుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది ఇష్టాను సారంగా నీటిని విడుదల చేస్తుండటంతో పనులుకు వెళ్లిన వారికి రోజూ తిప్పలు తప్పడం లేదు. బిందె, అరబిందె మేర తాగునీరు వస్తే ఇంటిల్లిపాదికి ఎలా సరిపోతాయని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

క్లోరినేషన్ శూన్యం

మండలంలోని 16 పంచాయతీ పరిదిలోని గ్రామాలల్లో ఉన్న గ్రౌండ్, ఓవర్ హెడ్ ట్యాంక్‌లను క్లోరినేషన్ చేసిన దాఖలాలు లేవు. దీంతో కలుషిత నీరు సరఫరా అవుతోందని, అవి తాగలేక బబుల్ నీటిని కొనాల్సి వస్తోందని మహిళలు చెబుతన్నారు. కొన్ని రోజుల క్రితం రామతీర్థం జలాశయానికి సంబంధించిన మోటారు చెడిపోగా, మరమ్మతులు చేయకుండా వదిలివేయడంతో నీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలానికి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

వాటర్ ట్యాంక్‌లు క్లోరినేషన్ చేయడం లేదు



మా గ్రామంలో వాటర్ ట్యాంక్ శుభ్రపరిచి శుద్ధ జలాలు అందించిన దాఖలాలు లేవు. తరచూ నీళ్లు కలుషితమై వస్తున్నాయి. వాటిని అస్సలు తాగలేకపోతున్నాం. అధికారులు స్పందించి శుభ్రమైన నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలి.

– రమణారెడ్డి (మన్నేపల్లి)

చాలా రోజులుగా తాగునీరు రావడం లేదు



తాగునీటి కోసం గంటల తరబడి కుళాయిల వద్ద బిందెలతో పడిగాపులు కాయాల్సి వస్తోంది. చాలా రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అందువల్ల బబుల్ నీరు కొనుగోలు చేసి తాగుతున్నాం. రోజూ డబ్బులుపెట్టి నీళ్లు కొనాలంటే ఇబ్బందిగా ఉంటోంది.

– బి.అంజమ్మ, బెల్లంకొండవారిపాలెం

వర్క్‌చార్జ్‌డ్ ఎంప్లాయీస్ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

దర్శి: దర్శి సబ్‌డివిజన్ పరిధిలోని గ్రామీణ నీటి సరఫరా విభాగం వర్క్‌చార్జ్‌డ్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక రాష్ట్ర నాయకుడు ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షునిగా కే రామమోహన్‌రావు, అధ్యక్షునిగా జూపల్లి గురప్పనాయుడు, ఉపాధ్యక్షులుగా పీ శివారెడ్డి, బరిగా నారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎం.ఎం.బేగ్, సహాయ కార్యదర్శులుగా ఎస్‌కే నజీర్, ఏ సత్యానారాయణ, ఎస్‌కే మస్తాన్‌వలి, కోశాధికారి పెమ్మా నారాయణ, కమిటీ సభ్యులుగా జూపల్లి అర్జున్ రావు, జేవీఎస్ సత్యనారాయణ, వై మల్లారెడ్డి, కే శ్రీనివాసులు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గురప్పనాయుడు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, ఐపీఎల్ లోన్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సభ్యులందరూ కలసికట్టుగా ఉండి యూనియన్ అభివృద్ధికి పాటు పడాలన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న నాయకులు

దర్శి: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, వాణిజ్య విభాగం నాయకులు కొల్లా ఉదయభాస్కర్ తదితరులు మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడటంలో పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం తెలుగు ప్రజలు మరువలేనిదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మేడం మోహన్‌రెడ్డి, తుళ్లూరి బాబూరావు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ షకీలా అమీన్‌బాషా, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, నాయకులు పానుగంటి మోహన్‌రావు, అచ్యుత సత్యం, కొడవటి జాన్, చెరుకూరి జగన్, వెంకటరెడ్డి, కుందురు నరసింహారెడ్డి, గొంది అప్పిరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో..

తెలుగు రాష్ట్రం కోసం తన ప్రాణాలు త్యజించి పొట్టి శ్రీరాములు అమర జీవిగా నిలిచిపోయారని మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. దర్శి ప్రభుత్వ పాఠశాలలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుస్తులు అందజేసిన కపురం శ్రీనివాసరెడ్డిని సంస్థ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో మానవత కమిటీ సభ్యులు ఎస్ఎన్‌సీహెచ్ సుబ్బారావు, సీహెచ్ బసవయ్య, పానుగంటి హనుమంతరావు, రాంపల్లె నర్సింహారావు, న్యాయవాది సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన చేసిన త్యాగాన్ని పలువురు నాయకులు కొనియాడారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘాలకు చెందిన నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, ఆదిత్య విద్యాసంస్థల అధినేత సూరె రమేష్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, రైతు విభాగం నాయకుడు యర్రరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మందుల ఆదిశేషు, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాష, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఆర్యవైశ్య సంఘం నాయకులు కందూరి గురుప్రసాద్, కందూరి కాశీవిశ్వనాథ్, మొగిలి సుబ్బారావు, జోగిపర్తి సంతోష్‌కుమార్, గోళ్ల కృష్ణారావు, జక్కా సుబ్బారావు, సూరె ప్రసాద్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, డి.సుబ్బారెడ్డి, పప్పర్తి శ్రీనివాసులు, ఎల్లారెడ్డి రోషిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కందుల సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

త్రిపురాంతకం: త్రిపురాంతకం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహంతో పాటు మహాత్మాగాంధీ విగ్రహానికి వ్యాపార వర్గాల వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పొట్టిశ్రీరాములు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు కె పూర్ణ నాగేశ్వరరావు, గురుస్వామి, రమేష్, కృష్ణ, శేఖర్ మల్లికార్జున్, బీజేపీ నాయకుడు కే పిచ్చయ్య, గురునాథం, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ నాయకుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు



దర్శిలో అమరజీవి విగ్రహానికి మానవత సంస్థ సభ్యుల నివాళి



దర్శిలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో కాశినాయన ఆరాధనోత్సవం



నాగయ్యస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



స్వామి దర్శనం కోసం క్యూలో నిలిచిన భక్తులు

పెద్దారవీడు: మండల పరిధిలో దేవరాజుగట్టు సమీపంలో వెలసిన కాశినాయన ఆశ్రమంలో 29వ ఆరాధనోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అర్చకులు బీవీ దత్తయ్య ఆధ్వర్యంలో కాశినాయనస్వామికి సుప్రభాతసేవ, నవగ్రహ మండపారాధన, కలశ, పంచామృతం, మంత్రపుష్పం, తదితర పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆశ్రమంలో ఉప ఆలయాలు అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, నవగ్రహాలు, నాగమయ్య స్వాములు, గోపికా సమేత రాధాకృష్ణుల భక్తులు పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర భక్త మండలిచే భక్తి భజన కార్యక్రమం, మధ్యాహ్నం పెద్దనాగులవరం బాలబాలికలచే భక్తి పాటలతో హనుమాన్ కోలాట బృందం ప్రదర్శన, కోడి శ్రీరామ్మూర్తి ఆరోగ్య క్రీడాభివృద్ధి సంస్థ వారిచే కర్రసాము, సాయంత్రం మార్కాపురం వారిచే భక్తి పాటలతో బంగారమ్మ తల్లి కోలాట బృందం ప్రదర్శన, రాత్రి సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకం ప్రదర్శన చేశారు. భక్తుల సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తుల కోసం మధ్యాహ్నం నుంచి రాత్రి సమయం వరకు అన్నసంతర్పణ కొనసాగించారు. మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.



దేవరాజుగట్టులో ప్రత్యేక అలంకారంలో కాశినాయనస్వామి

దొనకొండలో...

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో మార్గశిర శుద్ధ పౌర్ణమి సందర్భంగా కాశీనాయన ఆరాధన మహోత్సవాన్ని భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రధానార్చకులు మణిబాబుశర్మ కాశీనాయనకు పంచామృత అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, గురుదత్త అష్టోత్తర శతనామావళి పూజలు చేసి మహా నైవేద్యం సమర్పించి మంగళ హారతులిచ్చారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాశీనాయన విగ్రహ దాతలు ఇండ్లచెరువు గ్రామ వాస్తవ్యులు సాదం రామయ్య, కుటుంబ సభ్యులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పెదన్నపాలెం గ్రామస్తులు శింగిరెడ్డి గాలిరెడ్డి, వీరమ్మ దంపతులు భక్తులకు అన్నసంతర్పణ చేశారు. భైరవానంద స్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆనంద ఆశ్రమంలో ప్రత్యేక అలంకరణలో కాశీనాయన



ఆలయం ప్రాంగణంలో గోపికా సమేత రాధాకృష్ణులు



ఆలయం ప్రాంగణంలో బాల బాలికచే కోలాటం

మానవత్వం గొప్ప వరం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి భారతి



సబ్‌జైల్ స్టోర్ రూంలో ఖైదీలకు తెచ్చిన సరుకులు పరిశీలిస్తున్న న్యాయమూర్తులు

- జిల్లా జడ్జి ఎ.భారతి

దర్శి:

మానవత్వంతో మెలగడం గొప్ప వరమని జిల్లా జడ్జి ఎ.భారతీ దేవి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సబ్‌జైల్లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా జడ్జి ఎ.భారతి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాం బాబు, దర్శి సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శివశంకర్ రెడ్డి హాజరయ్యారు. జైలు పరిసరాల్లో కలియదిరిగి ఖైదీలతో మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితి, జైల్లో అందిస్తున్న ఆహారం, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. క్షణికావేశంలో తప్పులు చేసి వచ్చినవారికి జైలు శిక్షణాలయం లాంటిదే కానీ శిక్షాలయంగా మాత్రం అనుకోవద్దన్నారు. తాము చేసిన తప్పులను జైల్లో మననం చేసుకుని, ఆలోచించుకోవాలని సూచించారు. ఎవరూ కావాలని తప్పులు చేయరని అనుకోని పరిస్థితుల్లో చేసిన తప్పులను సరిదిద్దుకుంటారనే ఉద్దేశంతో శిక్షలు వేస్తారన్నారు. 'ప్రతిసారీ జైలుకు వచ్చి వెళ్తుంటే కుటుంబాల పరువు పోతుంది, మీ పిల్లలు కూడా సమాజంలో తలెత్తుకుని తిరగలేరని' హితబోధ చేశారు. ధ్యానం, యోగాసనాలు నిత్యం అలవాలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటరమణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

అల్లూరి పోలేరమ్మకు ఘనంగా పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగశిలలకు ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

నేటి నుంచి పట్టాభి రామాలయ మహా సంప్రోక్షణ

బేస్తవారిపేట: స్థానిక తేరు బజారులోని పట్టాభిరామస్వామి దేవస్థానం మహా సంప్రోక్షణ కార్యక్రమం సందర్భంగా ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 16న గణపతిపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, అఖండ దీపస్థాపన, ప్రధాన కలశస్థాపన, రుద్రాభిషేకం, 17న హనుమాన్ చాలీసా పారాయణం, పంచామృతాలు, అభిషేకములు, చండీ పారాయణ, ఆవాహితా దేవతా హోమాలు, సుదర్శన హోమం, 18న విశేష అర్చనలు, మూలమంత్ర హోమాలు, పూర్ణాహుతి, ఆలయ సంప్రోక్షణ, శిఖర కలశాభిషేకం, శాంతి కళ్యాణ పూజలు, మధ్యాహ్నం అన్న సంతర్పణ, రాత్రికి గ్రామోత్సవం నిర్వహిస్తామని వివరించారు.



వేడుకలకు ముస్తాబైన పట్టాభిరామస్వామి ఆలయం